క్లుప్తంగా

గురప్పస్వామికి పూజలు



పూజలు చేస్తున్న పవిత్రారెడ్డి

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో గురప్పస్వామికి సోమవారం వైఎస్సార్ సీపీ తొట్టంబేడు మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి పూజలు చేశారు. గ్రామస్తులు ప్రతి ఏటా గురప్పస్వామికి పొంగళ్లు పెట్టడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో గ్రామస్తుల ఆహ్వానం మేరకు పవిత్రారెడ్డి అర్చనలు, పూజా కార్యక్రమాలకు హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ మంజుల, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పాతగుంట గురవారెడ్డి, మాజీ ఎంపీటీసీ చెంబేటి మునిరత్నంరెడ్డి, మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మునిరెడ్డి, రవి, మునిరత్నం నాయుడు, కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన డాక్టర్ జి.వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి రూ.లక్ష విరాళాన్ని ఆలయ పాలకమండలి మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నారాయణవనం: మండల కేంద్రమైన నారాయణవనంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం పర్యటించనున్నట్లు ఎంపీడీఓ గుణశేఖర్, ఏఓ శోభారాణి తెలిపారు. రైతు భరోసా పొందనున్న కౌలు రైతులతో కమ్యూనిటీ భవనంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, చెక్కులను కౌలు రైతులకు అందిస్తారని వారు తెలిపారు.

హిందీ పండిట్‌కు ఉత్తమ అవార్డు



మల్లీశ్వరి

పిచ్చాటూరు: పిచ్చాటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న మల్లీశ్వరి జిల్లా ఉత్తమ అవార్డుకు ఎంపిక య్యారు. మంగళవారం తిరుపతిలో జరగనున్న జిల్లా స్థాయి గురుపూజోత్సవ కార్యక్రమంలో కలెక్టర్, డీఈఓ చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకోనున్నారు. మల్లీశ్వరి ఉపాధ్యాయ వృత్తితో పాటు యోగా, ధ్యానం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం ఆమె వరుస అవార్డులకు ఎంపిక కావడానికి కారణం అని సహోపాధ్యాయులు చెప్పారు. అవార్డుకు ఎంపిక కావడం పట్ల పాఠశాల హెచ్‌ఎం, సహ ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

ఓటర్ల జాబితా పరిశీలన



జాబితాను పరిశీలిస్తున్న ఈఆర్‌ఓ శ్రీనివాస్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఓటర్ల పరిశీలన పక్కాగా చేపటినట్టు ఎలక్టోరల్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఆయన సోమవారం మండలంలోని వీఎస్ పురం, కనమనంబేడు, నీర్పాకోట, కంచనపుత్తూరు గ్రామాల్లో ఓటరు పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మృతి చెందిన, చిరునామాలు మారిన, డబుల్ ఎంట్రీలు, వివాహమైన వారి ఓట్లను తొలగింపును క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో దొంగ ఓట్లకు ఆస్కారం లేకుండా చేయడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేస్తున్నట్లు చెప్పారు.

పీఎంఈజీపీతో రుణాలు



దరఖాస్తు అందజేస్తున్న శ్రీనివాసులు

ఏర్పేడు: చిన్నచిన్న వ్యాపారాల కోసం ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం(పీఎంఈజీపీ) ద్వారా ప్రభుత్వం నుంచి రుణాలు పొందవచ్చని వైస్ ఎంపీపీ జముళ్ల శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆమందూరు సచివాలయంలో లబ్ధిదారులకు దరఖాస్తులు అందజేసి ఆయన మాట్లాడారు. డెయిరీ ఫారం, కోళ్లు, గొర్రెల పెంపకం తదితర వ్యాపారాల కోసం ప్రభుత్వం రూ.2 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు రుణాలను ఇస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మునిరామయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి సమాజానికి
ఆరోగ్యకర పౌరులే లక్ష్యం

కేవీబీపురం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించి, రేపటి సమాజానికి ఆరోగ్యకరమైన పౌరులను అందించేడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందనిసత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. పిచ్చాటూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీడీపీఓ శోభారాణి, సూపర్‌వైజర్ కల్పలత అధ్యక్షతన పౌష్టికాహార మాసోత్సవాలను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు రోజూ తీసుకునే ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, మొలకెత్తిన గింజలు మొదలైనవి తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సంపూర్ణ పోషణ ఆహారంపై అవగాహనకు ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన, ఆహార పదార్థాలను ఆయన పరిశీలించారు. సూపర్‌వైజర్‌ను అభినందించారు.

132 నూతన పింఛన్లు పంపిణీ

మండలానికి ప్రభుత్వం మంజూరు చేసిన 132 నూతన పింఛన్లను ఎమ్మెల్యే నూతన పింఛనుదారులకు మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పింఛన్లను మంజూరు చేస్తుందన్నారు. 2019 తరువాత కేవీబీపురం మండలంలో సుమారు 12వేల మందికి కొత్త పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ, వైస్ ఎంపీపీ శ్రీనివాసయాదవ్, నేతలు లాలుబాబుయాదవ్, నందకుమార్, దశరథరామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు అయ్యప్ప, సుబ్బన్న, ఎంపీడీఓ రామచంద్ర, తహసీల్దార్ శ్రీదేవి, ఎంఈఓ లక్ష్మీపతి, అంగన్‌వాడీ వర్కర్లు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

బుచ్చినాయుడుకండ్రిగ: కొత్తగా మంజూరైన 91 పింఛన్లను సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, పార్టీ మండల కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డితో కలసి పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మణినాయు డు, నాయకులు గోపాల్‌రెడ్డి, ఉగ్గుమూడి గురునాథం, ఎంపీపీ సుబ్బలక్ష్మి, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, నాయకులు అజయ్‌కుమార్ రెడ్డి, నిరంజన్‌రెడ్డి, హరిప్రసాద్, సంజీవయ్య, సర్పంచ్ వెంకటమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా, కారణి హరిబాబు, ఎంపీడీఓ నరసింహరావు, ఎంఈఓ రవీంద్రనాథ్, సీడీపీఓ దేవకుమారి, సూపర్‌వైజర్లు చెంచులక్ష్మి, యమున, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండలంలో 399 మందికి నూతనంగా మంజూరైన పింఛన్లను సోమవారం వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం పౌష్టికాహార స్టాళ్లను సందర్శించి, కిట్లను పంపిణీ చేశారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పాల సుబ్రమణ్యం రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టు బోర్డు సభ్యుడు మల్లికార్జునరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సురేష్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, సీడీపీఓ రెడ్డిదేవకుమారి, సూపర్‌వైజర్లు జ్యోతి, యమున, డిప్యూటీ తహసీల్దార్ శాంతి, ఎస్ఐ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం



బీఎన్‌కండ్రిగ: వితంతువుకు పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

చిన్నారి వైద్యానికి రూ.7 లక్షలు అందజేత

న్యూరో ప్లాస్మా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న వరదయ్యపాళెనికి చెందిన దేవప్రకాష్, జ్యోతి దంపతుల కుమార్తె పవిత్రకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 7లక్షలు మంజూరైంది. ఆ నగదు చెక్కును సోమవారం ఎమ్మెల్యే చిన్నారి పవిత్ర తల్లిదండ్రులకు అందజేశారు.

అర్హులందరికీ పొజిషన్ పట్టాలు

గ్రామస్థాయిలో అర్హత కలిగిన వారందరికీ పొజిషన్ పట్టాలు ఇవ్వాలని మండల రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆ మేరకు ముస్లింపాళెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గౌసియానగర్‌లో తమ అనుభవంలో ఉన్న ఇంటి స్థలాలకు పొజిషన్ పట్టాలను స్థానిక సర్పంచ్ అబ్దుల్ మజీద్ ఆధ్వర్యంలో 32 మందికి ఎమ్మెల్యే అందజేశారు. మాజీ సర్పంచ్ రసూల్ సాహెబ్, ఆర్ఐ వేణుగోపాల్, వీఆర్వో హనీఫ్ పాల్గొన్నారు.

పింఛనుదారుల కుటుంబాల్లో పండుగ



నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

- పార్టీలకతీతంగా పింఛన్లు ఇస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- టీడీపీ పాలనలో ఎవరైనా పాత పెన్షనర్లు చనిపోతేనే కొత్తగా పింఛన్లు ఇచ్చిన దౌర్భాగ్య స్థితి
- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

శ్రీకాళహస్తి: నియోజకవర్గంలోని సామాజిక పింఛనుదారులకు ప్రతినెలా 1వ తేదీనే వలంటీర్లతో పింఛన్లు అందజేస్తూ, ప్రభుత్వం ఆ కుటుంబాల్లో పండుగ వాతావరణం తెచ్చిందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. కొత్తగా మంజూరైన 178 పింఛన్లను సోమవారం శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యంతో కలిసి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, అవ్వాతాతలు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులకు పింఛన్లు వారి జీవితానికి నిశ్చింతనిస్తున్నాయన్నారు. 2లక్షల మంది జనాభాలో 50వేల మందికి పింఛన్లు ఇచ్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. కులమతాలు, పార్టీలు, రాజకీయాలకతీతంగా పింఛన్లను తమ ప్రభుత్వం ఇస్తోందన్నారు. గత టీడీపీ పాలనలో పింఛన్లు పేదలకు అందని ద్రాక్షేనని, కొత్తగా పింఛను మంజూరు చేయాలంటే..పాత పింఛనుదారులు ఎవరైనా చనిపోతేనే ఇచ్చే దౌర్భాగ్య స్థితి ఉండేదన్నారు. ఊరిలో ఎవరు చనిపోతారా? అని ఎదురుచూసేవారని, చంద్రబాబు ప్రభుత్వంలో ఇతరుల చావు చూసేవిధంగా పింఛను ఉండేదని గుర్తుచేశారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత జన్మభూమి కమిటీలనే రాబందులు లేకుండా నేరుగా లబ్ధిదారులకు పింఛను ఫలాలు అందజేస్తున్నామన్నారు. చంద్రబాబు నాయుడు ఇపుడు మళ్లీ కొత్తగా భవిష్యత్తుకు గ్యారెంటీ అంటూ ప్రజలను మభ్యపెడుతూ, ఓట్ల కోసం వెంపర్లాడుతున్నాడని, ఆయనకు ప్రజలు మళ్లీ బుద్ధి చెప్పాలన్నారు. జగనన్న సంక్షేమ ఫలాలు ఇస్తే శ్రీలంకగా మారుతుందన్న చంద్రబాబు.. ఆయన సంక్షేమ ఫలాలు ఇస్తే సింగపూర్‌లా మారుతుందా? అని ప్రశ్నించారు. కనీసం బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సొంత గ్రామంలో కూడా టీడీపీ పాలనలో కొత్తగా పింఛన్లు ఇచ్చిన పాపానపోలేదన్నారు. దేశ చరిత్రలో ఎవరూ చేయలేని విధంగా నియోజకవర్గంలో ఎవరైనా పేదలు చనిపోతే రూ.10వేలు ఇవ్వడం, వివాహ శుభ కార్యాలయాలు, కరోనా కష్టకాలంలో ఆదుకున్న ఘనత తమకే దక్కిందన్నారు.

అపర ధన్వంతరి జగనన్న : సిపాయి

ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ, జగనన్న అపర ధన్వంతరి అని కీర్తించారు. మూడువేల జబ్బులకు ఆరోగ్యశ్రీ వర్తింపచేసిన గొప్ప ముఖ్యమంత్రి అన్నారు. ఎంతో మంది రోగులు వైద్యం కోసం ఆస్తులు సైతం అమ్ముకున్న ఉదంతాలు తనకు తెలుసని, ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఆ దుస్థితి లేదన్నారు. విద్య, వైద్య రంగాలకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందన్నారు. బీసీలను తెలుగుదేశం వాడుకుని వదిలేస్తుందని, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇద్దరు బీసీ ఎమ్మెల్సీలు ఉన్నారంటే ..దానికి జగనన్న బీసీలకు ఇచ్చిన గౌరవమన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అటు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తూనే, మరోవైపు సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజల హృదయాలను గెలుచుకున్నారని ఆయన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంపూర్ణమ్మ, జెడ్పీటీసీ వెంకట సుబ్బారెడ్డి, మండల నాయకులు బర్రె హేమభూషణరెడ్డి, వైస్ ఎంపీపీ భానుమూర్తి యాదవ్, వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి, సురేంద్ర యాదవ్, ఎంపీటీసీ గోవిందరెడ్డి, మండలాధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

ఆర్బీకే, సచివాలయ భవనాల ప్రారంభం

శ్రీకాళహస్తి: మండలంలోని అక్కుర్తిలో సచివాలయం, ఆర్బీకే కేంద్రాలను సోమవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమ్మణ్యం ప్రారంభించారు. అభివృద్ధి అంటే ఏమిటో చేతల్లో జగనన్న చూపుతున్నారని, 30 ఏళ్లుగా పాలించిన పాలకులకు సాధ్యం కానిది నేడు జగనన్న పేద ప్రజలకు చేసి చూపెడుతున్నారన్నారు. అలాగే ఎన్నికలు సమీపిస్తుండడంతో హైదరాబాద్ నుంచి శ్రీకాళహస్తికి వచ్చిన బొజ్జల కుటుంబం పిలవని చావులకు, పెళ్లిలకు తెగ తిరుగుతోందని అపహాస్యం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సంపూర్ణమ్మ, జెడ్పీటీసీ సుబ్బారెడ్డి, నాయకులు బర్రె హేమభూషణ్‌రెడ్డి, కృష్ణయ్య, పోలిరెడ్డి, సురేంద్ర యాదవ్, రాములమ్మ, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మల్లవారిపాళెం తూర్పు ఉపసర్పంచ్‌గా గిరిజ

సత్యవేడు: మండలంలోని మల్లవారిపాళెం తూర్పు పంచాయతీ ఉప సర్పంచ్‌గా వి. గిరిజ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కే. రవి ప్రకటించారు. సోమవారం మల్లవారిపాళెం తూర్పు పంచాయతీలో ఉపసర్పంచ్ ఎన్నిక జరిగింది. పంచాయతీ పరిధిలోని 5వార్డు సభ్యుడు ప్రతాప్ తొలుత వి. గిరిజ పేరును ప్రతిపాదించగా 10వ వార్డు సభ్యుడు మూర్తి బలపరిచారు. పంచాయతీ పరిధిలో 10 మంది సభ్యుల్లో ఏడుగురు వార్డు సభ్యులు ఆమెను బలపరచడంతో ఉపసర్పంచ్‌గా గిరిజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపసర్పంచ్‌గా ఎన్నికైన గిరిజకు ఎమ్మెల్యే కోనేటి శాలువ కప్పి అభినందించారు. పంచాయతీ పరిధిలో ఉప సర్పంచ్ ఏకగ్రీవంగా ఎన్నుకొన్నందుకు సర్పంచ్ పార్వతి, సన్యాసయ్యను ఎమ్మెల్యే అభినందించారు.



గిరిజకు ధ్రువీకరణపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి రవి

నిందితులను అరెస్టు చేయాలి

సత్యవేడు: మండలంలోని రాచపాళెం దళితవాడకు చెందిన మన్నార్ కుమార్ మృతికి కారకులైన నిందితుల్ని శ్రీసిటీ పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని ప్రజా సంఘాలు. దళిత ఐక్యవేదిక సంఘం నాయకులు కోరారు. సోమవారం సీపీఎం, సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. నాయకులు మాట్లాడుతూ 2023 ఫిబ్రవరి27వ తేదీన ఆరుగురిని చంపేందుకు ప్రయత్నించారని మృతుడి భార్య శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. అయినా నిందితులను ఆరు నెలలుగా అరెస్టు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి చిన్నిరాజ్, కుల వివక్ష సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేశాండీ, సీపీఎం జిలా కార్యదర్శి వందవాసి నాగరాజు, డివిజన్ ఇన్‌చార్జి దాసరి జనార్దన్, రమేష్, అరుణాచలం పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం టీటీడీ బోర్డు సభ్యుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు వారికి స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు హరి యాదవవ్, నాగభూషణం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద టీటీడీ బోర్డు సభ్యుడు వెంకట సతీష్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ఉపాధి హామీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): మండలంలోని చిట్టత్తూరులో ఉపాధి హామీ పనులను సోమవారం పథక సంచాలకులు శ్రీనివాస ప్రసాద్ పరిశీలించారు. గ్రామంలో ఊటగుంట పూడికతీత పనులను తనిఖీ చేశారు. గిట్టుబాటు కూలీ వచ్చేలా పనిచేయాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో సహాయ పథక సంచాలకులు ప్రేమకుమార్, ఏపీఓ సుజాత, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

విజయ సాధనపై వర్క్‌షాప్

గూడూరు రూరల్: పోటీల్లో విజయం సాధించడంపై సోమవారం గూడూరులోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకులు డాక్టర్ గోవిందు సురేంద్ర ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. పోటీ పరీక్షల్లో రాణించడం ఎలా, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంలో తీసుకోవాల్సిన మెళకువలపై కావలి జవహర్ భారతి డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ జె.కృష్ణప్రసాద్, నెల్లూరు డీకే డబ్ల్యూ కళాశాల అధ్యాపకులు డాక్టర్ తోటకూర రాంబాబు, రాపూరు డిగ్రీ కళాశాల అధ్యాపకులు జె.స్వరూప విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.శ్రీనివాసులు, డాక్టర్ కె.శివప్రసాద్, శైలజ, ఝాన్సీవాణి, శ్రీధర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వక్తలు

విద్యాసామగ్రి, వాటర్ బాటిళ్ల వితరణ



కేవీబీపురం: మండలంలోని రాయపేడు ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 52 మంది విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన నత్తం మాధవ్, సంపూర్ణ విద్యాసామగ్రితో పాటు వాటర్ బాటిళ్లను వితరణ చేశారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వీటిని అందించినట్లు వారు తెలిపారు.

ద్రౌపదీదేవి కోవిల్‌కార్లకు సన్మానం

పుత్తూరు రూరల్: శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించిన ఆలయ కోవిల్‌కార్లను స్థానిక నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు సోమవారం ఘనంగా సత్కరించారు. కోవిల్‌కార్లు సాత్వాకం ఏలుమలై మొదలి, సాత్వాకం పళనిమొదలి, సాత్వాకం గోపిమొదలి, సాత్వాకం పెరుమాళ్‌మొదలి, సాత్వాకం కుప్పుస్వామిమొదలితో పాటు ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్, పూజారి మోహన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు సుబ్రమణ్యం, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణజన్మాష్టమి పోస్టర్ల ఆవిష్కరణ

తిరుపతి కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో ఇస్కాన్ మందిరంలో నిర్వహించనున్న శ్రీకృష్ణజన్మాష్టమి పోస్టర్లను టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పద్మావతిపురంలోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈనెల 7వ తేదీ ఇస్కాన్‌లో జరిగే వేడుకలకు హాజరుకావాలని కోరుతూ ఇస్కార్ ప్రతినిధులు భూమనకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు రేవతి రమణదాస్, రూపేష్‌ప్రభు, లీలా పారాయణదాస్ ఉన్నారు.



అథ్లెటిక్స్‌లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ

నాయుడుపేట: అంబేడ్కర్ బాలుర గురుకులం విద్యార్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరచారని ప్రిన్సిపల్ రూత్‌రమోల్ తెలిపారు. స్థానిక బాలికల వసతి గృహంలో అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థిని బీ.షర్మిల 600 మీటర్లు పరుగు పందెంలో రెండో స్థానం సాధించినందుకు జ్ఞాపిక, సర్టిఫికెట్, రూ.2వేలు బహుమతి అందించారన్నారు. అలాగే ఎనిమిదో తరగతి విద్యార్థిని బీ.షర్మిల 300 మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానంలో నిలిచినందుకు జ్ఞాపిక, సర్టిఫికెట్, రూ.వెయ్యి బహుమతిని ఇచ్చారన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

నేడు శివపార్వతుల శాంతి కల్యాణం

చిల్లకూరు: మండలంలోని ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో మంగళవారం శ్రీకాళహస్తీలోని జ్ఞాన ప్రసూనాంబ శ్రీకాళహస్తీశ్వర స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ ధర్మప్రచార పరిషత్ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రచార రథం తూర్పుకనుపూరు గ్రామానికి చేరుకుందన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జరిగే కల్యాణ వేడుకలను భక్తులు కనులారా వీక్షించి తరించాలని ఆమె కోరారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకున్న కళ్యాణ రథానికి స్వాగతం పలికారు. ఆమె వెంట ఆలయ ఈఓ నవీన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.



ముత్యాలమ్మ ఆలయం వద్ద ముక్కంటి ప్రచారరథం

సైన్స్, ప్రకృతి రెండూ సమానమే

శ్రీకాళహస్తి: సైన్స్, ప్రకృతి రెండూ సమానమేనని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత అన్నారు. కళాశాల ఆవరణలో సోమవారం మొక్కలను నాటారు. ఆమె మాట్లాడుతూ, చంద్రయాన్‌-3 ప్రయోగం విజయవంతం కావడంతో ఆ విజయోత్సవాన్ని వారం పాటు భౌతిక శాస్త్ర విభాగం విద్యార్థులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 4వ రోజైన సోమవారం ప్రకృతిపై అవగాహన కల్పించామన్నారు. సైన్స్ పరిశోధనలు ఎంత విలువైనవో ప్రకృతిని కాపాడటం, చెట్లను పెంచడం అంతే విలువైనవన్నారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 7వ రోజు విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మురళి, అధ్యాపకులు డాక్టర్ పి.సత్యనారాయణరెడ్డి, డాక్టర్ ఎం.పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.



మొక్కలకు నీళ్లు పోస్తున్న ప్రిన్సిపల్ శ్రీలత



ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

కోట: ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఎంఈఓ మస్తానయ్య తెలిపారు. అందులో భాగంగా సోమవారం ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. స్థానిక బీసీ గురుకుల పాఠశాల మైదానంలో ఉపాధ్యాయులకు వివిధ అంశాల్లో ఆటల పోటీలు జరిగాయి. ఉత్సాహంగా పాల్గొన్న ఉపాధ్యాయులు పోటీల్లో తమ సత్తా చాటారు. విజేతలకు మంగళవారం నిర్వహించనున్న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బహుమతి ప్రదానం చేస్తామన్నారు.